క్లుప్తంగా

సినిమా హాల్ తనిఖీ



ఫైర్ సేఫ్టీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీకాంత్

నరసన్నపేట: సినిమా హాల్స్‌లో విధిగా పరిశుభ్రత పాటించాలని అదనపు డీఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్ అన్నారు. సినిమా హాల్స్‌కు ఇచ్చే బీ-ఫారం రెన్యువల్‌లో భాగంగా మంగళవారం వెంకటేశ్వర థియేటర్‌ను తనిఖీ చేశారు. టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ ఉన్నారు.

19 వాటర్ ట్యాప్‌ల చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వివేకానంద

పొందూరు: మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుర్తుతెలియని వ్యక్తులు వాటర్ ట్యాప్‌ల చోరీకి పాల్పడ్డారు. కళాశాలలో ఇటీవల నాడు-నేడు పనుల్లో భాగంగా మరుగుదొడ్లను నిర్మించారు. మరుగుదొడ్లకు వేసిన తాళాలను పగలగొట్టి అందులో వాష్ బేసిన్లకు ఉన్న వాటర్ ట్యాపులను చోరీ చేశారు. 19 వాటర్ ట్యాప్‌లు చోరీకి గురైనట్లు ప్రిన్సిపాల్ సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ సి.హెచ్.వివేకానంద మంగళవారం కళాశాలను పరిశీలించి విచారణ చేపట్టారు. నైట్ వాచ్‌మెన్‌కు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.60.02 లక్షలతో నిర్మించనున్న వివిధ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. వివిధ శాఖల అధికారులు, అక్కులపేట సర్పంచ్ బి.గౌరీపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



గొట్ట పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతురావు

హిరమండలం: మండలంలోని గొట్ట గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ హనుమంతురావు మంగళవారం పరిశీలించారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థులకు పలు పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. ఉప తహసీల్దార్ నీలిమ ఉన్నారు.

అపార్ కార్డులు తప్పనిసరి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

నరసన్నపేట: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని డిప్యూటీ ఈఓ విజయకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ విధానాన్ని కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఆధార్ తరహాలో విద్యార్థులకు అపార్ కార్డులు మంజూరు చేయనుందన్నారు. ప్రతీ విద్యార్థికి అపార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. అపార్ కార్డుల మంజూరులో శ్రీకాకుళం జిల్లా వెనకబడి ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో ప్రగతి కనిపించాలన్నారు. నరసన్నపేట ఎంఈఓ దాలినాయుడు, పోలాకి ఎంఈఓలు నాయక్, లింగరాజు, జలుమూరు ఎంఈఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి ఊతం



టి.లింగాలపాడులో ఏర్పాటు చేసిన ఎన్ఎల్ఎం యూనిట్

- ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్ల యూనిట్లకు ప్రత్యేక మిషన్
- పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంచేందుకు ప్రణాళికలు
- ఔత్సాహికులకు రాయితీపై రుణాల మంజూరు

జీవాలు, ఆవులు, గేదెల వివరాలు ఇలా..

నియోజకవర్గం	జీవాలు	ఆవులు, గేదెలు
నరసన్నపేట	42,500	37,546
పాతపట్నం	44,359	42,345
ఆముదాలవలస	39,432	39,293

జలుమూరు: రైతు బాగుంటే దేశం బాగున్నట్టు అన్నది నానుడి. పాడి పరిశ్రమతోపాటు కోళ్లు, జీవాలైన గొర్రెలు, మేకల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ఊతమిస్తోంది. జీవాల పెంపకానికి ముందుకు వచ్చిన ఔత్సాహికులకు ఇప్పటికే పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డులు (పీకేసీసీ) అందజేస్తోంది. గుడ్లు, పాలు, మాంసం ఉత్పత్తులను సైతం పెంచేందుకు వీలుగా ఆయా యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకుంటోంది. ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే వారి ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడే అవకాశం ఉంటుందని ప్రభుత్వ ఆలోచన.

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్..

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా విరివిగా కేంద్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. ఇందులో ఆవులు, గేదెలు, కోళ్లు, జీవాలైన గొర్రెలు, మేకల యూనిట్ల ఏర్పాటుకు రాయితీ లభిస్తోంది.

రాయితీ ఇలా..

కోళ్లు, పందులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు పెంపకానికి రూ.10 లక్షల నుంచి రూ.కోటి పెట్టుబడి పెడితే.. అందులో 50 శాతం రాయితీని ప్రభుత్వం మంజూరు చేస్తోంది. పశుగ్రాసం, దాణాకు సైతం ప్రభుత్వమే ప్రోత్సాహం అందజేస్తోంది.

దరఖాస్తు విధానం ఇలా..

ఈ పథకం ద్వారా రాయితీ పొందాలనుకుంటే 18 నుంచి 65 ఏళ్ల వయస్సు లోపల గలవారు ఒక సంఘంగా ఏర్పడి యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకు సంబంధించి భూమి సొంతంగా కలిగి ఉండాలి లేదా అద్దె, కౌలుకు తీసుకోవాలి. సంబంధిత యూనిట్ల పెంపకంపై అనుభవాన్ని తప్పనిసరిగా చూస్తారు. నిబంధనల మేరకు పత్రాలు సక్రమంగా ఉంటే ఆన్‌లైన్‌లో రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలో రుణాన్ని మంజూరు చేసే బ్యాంకు సమ్మతి కూడా అవసరం.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రధానంగా యువతకు ఉపాధి కల్పించేందుకు ఎస్ఎల్ఎం మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ పథకం పెట్టింది. ఏ యూనిట్‌కు అయినా 50 శాతం రాయితీ కల్పిస్తోంది. కష్టపడి పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలం. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు సాగాలి.

– పి.మోహన్‌రావు, టి.లింగాలపాడు, ఎస్ఎల్ఎం యూనిట్ స్థాపకుడు

ఎంతమందైనా దరఖాస్తు చేసుకోవచ్చు..



జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా ఆయా యూనిట్ల స్థాపనకు ఎంతమందైనా అర్హులే. ఆసక్తి ఉన్నవారు తమను సంప్రదిస్తే పోర్టల్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో వివరిస్తాం. ఇప్పటికే పశువైద్య కేంద్రాల వద్ద రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.

– కె.జయరాజ్, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి

అభ్యంతరాలుంటే తెలియజేయండి



ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

నరసన్నపేట: ఓటరు జాబితా-2025 సవరణలో భాగంగా ముసాయిదా జాబితాను విడుదల చేశామని, దీనిపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ముసాయిదా ఓటరు జాబితాను తహసీల్దార్ కార్యాలయంలో విడుదల చేశారు. సవరణల కోసం నవంబర్ 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తుది జాబితా వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన వెల్లడిస్తామన్నారు. నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటా సర్వే చేపట్టారన్నారు. మృతులు, వలస ఓటర్లను తొలగించామన్నారు. 2015 జనవరి ఒకటో తేదీ నాటికి అర్హులైన వారినుంచి కొత్తగా ఫారం-6లు తీసుకోవడం జరిగిందన్నారు. ముసాయిదాపై అభ్యంతరాల స్వీకరణకు పోలింగ్ కేంద్రాల్లో నవంబర్ 9, 10, 23, 24వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ శరత్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ శ్రీను, క్లర్క్ మురళి, వీఆర్వో తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



సవర చీడిపాలెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ ఈఈ రమాదేవి

మెళియాపుట్టి: మండలంలో ఐటీడీఏ ద్వారా అంగన్‌వాడీ, కమ్యూనిటీ హాల్ తదితర ఉపయోగాల కోసం మల్టీపర్పస్ సెంటర్ నిర్మించడం ద్వారా సౌకర్యవంతంగా ఉంటుందని ఐటీడీఏ ఈఈ రమాదేవి అన్నారు. భవన నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని మండలంలోని పాతర్లోవ, సవర చీడిపాలెం గ్రామాలలో మంగళవారం పరిశీలించారు. పీఎం జన్మాన్ నిధులు రూ.60 లక్షలతో భవన నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవన సముదాయాలను సందర్శించి నాణ్యతాప్రమాణాలను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. డీఈ సిమ్మన్న, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

యంత్రాలు, టార్పాలిన్లు పంపిణీ చేయాలి

నరసన్నపేట: రైతులుకు యంత్ర పరికరాలు, టార్పాలిన్లు సబ్సిడీపై పంపిణీ చేయాలని గోపాలపెంట సర్పంచ్ యండ కృష్ణవేణి, రైతులు కోరారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి కె.సునీత గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. రబీ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ వివరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రూప్‌గా ఏర్పడితే యంత్రాలు ఇస్తున్నారని, అలా కాకుండా వ్యక్తిగతంగా వరి కోత మిషన్లు, ఇతర పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఏఓ అన్నారు.

ఆటలు ఆడేదెలా?



సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అధ్వానంగా ఉంది. పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పిచ్చిమొక్కలు, పొదలు అల్లుకోవడంతో పాములు, విష జంతువుల తాకిడి అధికంగా ఉంటుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రహరీ నిర్మాణం సగంలో నిలిచిపోయింది. అధికారులు స్పందించి కళాశాల మైదానాన్ని బాగుచేయాలని, ప్రహరీ నిర్మాణం పూర్తిచేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

సాగునీరు అందేదెలా?



బూర్జ మండలంలోని గజిల్ గెడ్డ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ప్రస్తుతం వరి పంట చివరి దశలో ఉంది. సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాగే ఉంటే రబీ పంటలకు కూడా నీరు అందడం కష్టమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

– బూర్జ

హెడ్ బిగించేది ఎప్పుడు?



సారవకోట మండలంలోని అంగూరు సచివాలయం ఆవరణలో గత ప్రభుత్వ హయాంలో బోరు ఏర్పాటు చేశారు. ఆ బోరుకు నేటికీ హెడ్ బిగించలేదు. మోటార్ ఏర్పాటు చేయలేదు. వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన బోరు నిరుపయోగంగా ఉంది. సచివాలయ సిబ్బంది నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు.

– సారవకోట

సాగునీరు వృథా..



శ్రీకాకుళం రూరల్, గార మండలంలోని తదితర ప్రాంతాలకు సాగునీరు అందించే ఆమదాలవలస మండలం గేదెలవానిపేట సమీపంలోని వయోడెక్ట్ లీకు అవుతోంది. సాగునీరు వృథా అవుతోంది. గేదెలవానిపేట జంక్షన్ వద్ద నీరు నిత్యం ప్రవహించడంతో అలికాం-బత్తిలి రహదారి పాడైంది. ఈ విషయంపై వంశధార అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని మన్నయ్యపేట, చింతాడ, నందగిరిపేట తదితర గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఈ లీకులను బాగుచేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస

రేషన్ సరుకులకు బూజు!



నేలపై నిల్వ చేసిన రేషన్ సరుకులు

సరుబుజ్జిలి: మండలంలోని పౌర సరఫరాల గొడౌన్ (ఎంఎల్ఎస్ పాయింట్)లో ఉన్న సరకులను సక్రమంగా భద్రపర్చకపోవడంతో వాటి నాణ్యత పూర్తిగా దెబ్బతింటుందని పలువురు రేషన్ డిపోల డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన సరకులను ఈ గొడౌన్‌లో సరుబుజ్జిలి మండలంలోని 41 రేషన్ డిపోలు, ఎల్.ఎన్.పేటలోని 36, బూర్జ 33, హిరమండలం, జలుమూరు మండలాలకు 3 చొప్పున, ఆమదాలవలస-1 డిపోకు చెందిన బియ్యం, కందిపప్పు, పామాయిల్ తదితర వస్తువులు నిల్వ చేస్తారు. షెడ్యూల్ ప్రకారం ఆయా డిపోలకు తరలిస్తారు. వస్తువులు నిల్వ చేసే సమయంలో పూర్తిగా రక్షణ చర్యలు తీసుకోవడంలేదు. సరుకుల అడుగు భాగంలో టార్పాలిన్లు వేయకుండా నిల్వ చేస్తున్నారు. గొడౌన్ శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాలు పడుతున్న సమయంలో లోపలికి నీరు లీక్ అవుతుంది. సరకులకు బూజుపడుతుందని డీలర్లు అంటున్నారు. నాణ్యతలేని సరకులు అందించే సమయంలో కార్డుదారుల నుంచి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఇదే విషయమై జిల్లా పౌరసరఫరాల అధికారి గురుగుబెల్లి సూర్యప్రకాశరావు వద్ద ప్రస్తావించగా.. గొడౌన్‌లో సరకులు సక్రమంగా భద్రపరచాలి. తరుగులు లేకుండా చూడాలి. వెంటనే పరిశీలించి సత్వర చర్యలు తీసుకొంటామని వెల్లడించారు.

వరి పంట నాశనంపై ఫిర్యాదు



పాడైన వరి పంట

మెళియాపుట్టి: తనకు చెందిన వరి పంట (53 సెంట్లు)పై గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి గడ్డి మందు పిచికారీ చేశారని మండలంలోని జాడుపల్లి గ్రామానికి కలమట సూర్యనారాయణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గడ్డిమందు పిచికారీ చేయడంతో చేతికి అందివచ్చిన పంట పాడైందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పంట నష్టాన్ని గుర్తించి పరిహారం అందించాలని కోరారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

హిరమండలం: అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో స్థానిక ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అన్నిరకాల పత్రాలు ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

పలు కుటుంబాలకు పరామర్శ



పాతపట్నం: సర్పంచ్ వెంకటరమణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: ఖగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని తెంబూరు సర్పంచ్ బెనియా వెంకటరమణ తల్లి కమలమ్మ ఇటీవల అనారోగ్యం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం సర్పంచ్ వెంకటరమణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, నాయకులు పనుకు మోహన్, అన్నారావు, దొర పార్వతీశం, జి.అప్పన్న, ఈశ్వరరావు, మన్మధరావు, పడాల రంజీత్, సత్య బిశ్వాల్ ఉన్నారు.

ధనుపురంలో..

హిరమండలం: మండలంలోని ధనుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మామిడి ఖగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఖగేశ్వరరావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి ఢిల్లేశ్వరరావు, మామిడి గంగాధరరావు, ఎ.భాస్కరరావు, ఎస్.ప్రదీప్, మోహన్, సత్య బిశ్వాల్ ఉన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పొదలు తొలగించిన తరువాత విద్యుత్ స్తంభం

సాక్షి ఎఫెక్ట్

సరుబుజ్జిలి: అల్లుకున్న నిర్లక్ష్యం పేరుతో సోమవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. పాలవలస కాలనీకి సమీపంలోని విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదలను మంగళవారం తొలగించారు. స్తంభం చుట్టూ షార్ట్ సర్క్యూట్ సమస్య లేకుండా సరిచేశారు.

40 బాణసంచా దుకాణాలకు అనుమతి

పొందూరు: శ్రీకాకుళం డివిజన్ పరిధిలో 40 బాణసంచా దుకాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు శ్రీకాకుళం డీఎస్పీ సి.హెచ్.వివేకానంద పేర్కొన్నారు. మంగళవారం పొందూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి పొందినవారంతా నిబంధనల మేరకు మందుగుండు సామగ్రిని విక్రయించాలని సూచించారు. ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

విత్తన శుద్ధి అవసరం



ఈ-పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏఓ సంధ్య

హిరమండలం: పెసర, మినుము, మొక్కజొన్న, నువ్వు విత్తనాలను ఎలా శుద్ధి చేయాలో ఏఓ బి.సంధ్య అవగాహన కల్పించారు. మండలంలోని ఎంఎల్‌పురం పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించారు. కోత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతు సేవా కేంద్రంలో రబీలో వేయనున్న పంటలు, విత్తన శుద్ధి వంటి విషయాలను వివరించారు. ఈ-పంట నమోదు చేసిన రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతుల జాబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి స్వామిని ఊరేగిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు

హిరమండలం: స్థానిక పాతబస్టాండ్ వద్ద ధన్వంతరి జయంతిని మంగళవారం లక్ష్మీగణపతి నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణులు, ఆయుర్వేదిక్ వైద్యులు జయంతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు.

తెగుళ్లపై అప్రమత్తం



గంగువాడలో అవగాహన కల్పిస్తున్న ఏఓ రవికుమార్

పాతపట్నం: వరి పంటలో సుడిదోమ, పోడ, అగ్గి తెగుళ్ల నివారణ చర్యలపై రైతులుకు ఏఓ బి.రవికుమార్ సూచనలు తెలియజేశారు. మండలంలోని గంగువాడ, చిన్నమల్లిపురం గ్రామాల్లో వరి తెగుళ్లపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపించాలన్నారు. పంట నమోదును రైతులు పరిశీలించుకోవాలన్నారు. ఏఈఓ శారధ, జెడ్‌బీఎన్ఎఫ్ మండల కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, రైతులు మజ్జి రామయ్య, గంగాధర్, డి.ప్రసాద్, బాబూరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



ఇంటికి అతి సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు

సరుబుజ్జిలి: రొట్టవలస రజక వీధిలోని మంతెన రాము ఇంటిపై నుంచి చేతికి అందినంత ఎత్తులో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. వైర్లను తొలగించాలని లైన్‌మన్‌ను పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదని రాము ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

భారీ వర్షం

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మబ్బులు వేసి చిన్న చినుకులుగా ప్రారంభమై కుండపోతగా కురిసింది. సుమారు గంటపాటు వర్షం కురవడంతో మండల కేంద్రంలోని పలు వీధుల్లో వర్షంనీరు ప్రవహించింది. ఈ వర్షం వరి, ఇతర పంటకు ఊపిరిపోసినట్లు అయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్.ఎన్.పేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు